AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

అమెరికా సరిహద్దుల్లో ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్ట్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలపై కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆ దేశ సరిహద్దుల్లో ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్టయినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం తెలిపింది. 2025 జనవరి - డిసెంబర్ మధ్యలో 23,830 మంది భారతీయులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఇలా పట్టుబడుతున్న అక్రమ వలసదారుల్లో అత్యధికులు భారతీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

భారత్‌కు ప్రపంచ దేశాధినేతల శుభాకాంక్షలు

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షల సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. చైనా, రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఈయూ, ఇరాన్, నేపాల్, ఆస్ట్రేలియా, భూటాన్ మొదలైన దేశాల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఈ సందర్భంగా ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు.

26-1-2026 (Monday) MAIN EDITION

చివరి రెండు టీ20 తిలక్ దూరం

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లు ఆడట్లేదని బీసీసీఐ తెలిపింది. అతని స్థానంలో శ్రేయస్ జట్టులో కంటిన్యూ అవుతారని వివరించింది. కాగా.. టీ20 వరల్డ్ కప్ నాటికి తిలక్ వర్మ ఫిట్‌నెస్ సాధిస్తారని క్రీడా వర్గాలు చెబుతున్నారు.

'బోర్డర్–2'కు రూ. 120కోట్లు

అక్షరటుడే, సినిమా డెస్క్: సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన బోర్డర్–2 మూవీ కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఆదివారం ఈ చిత్రం రూ.54 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టగా ఈ చిత్రం మూడు రోజుల్లోనే రూ. 120 కోట్లకు పైగా నెట్ వసూలు చేసినట్లు సినీ వర్గాలు పేర్కొన్నాయి. నేడు సెలవు కావడంతో మరో రూ.50 కోట్లు కలెక్ట్ చేసే అవకాశం ఉంది.

చైనా ఉన్నత జనరల్‌పై దర్యాప్తు..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: చైనా సైనిక వ్యవస్థలో అత్యంత ప్రభావశీలమైన అధికారుల్లో ఒకరు తీవ్ర వివాదాల మధ్య చిక్కుకున్నారు. అవినీతి ఆరోపణలతో పాటు దేశానికి చెందిన ముఖ్యమైన అణ్వస్త్ర సమాచారాన్ని అమెరికాకు అందించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ మొదలైందని తెలుస్తోంది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయం

■ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
■ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ■ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన రిపబ్లిక్ డే వేడుకలకు హాజరయ్యారు. జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదన్నారు. ఇది మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించడానికి, రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి మనకున్న విధిని గుర్తుచేసే ఒక సందర్భం అన్నారు. రాజ్యాంగం మనకు న్యాయం, సమానత్వం సౌభ్రాతృత్వాన్ని అందించిందన్నారు.

–అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని గవర్నర్ అన్నారు. రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ఇటీవల 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్ ఆవిష్కరించిందన్నారు. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు. వికసిత భారత్ 2047 నాటికి భారతదేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని కేంద్రం సంకల్పించిందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని గవర్నర్ తెలిపారు. దీనికోసం తెలంగాణ రైజింగ్ - విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు చెప్పారు.

అత్యుత్తమ నగరంగా..

రాష్ట్రాన్ని మూడు ఆర్థిక మండళ్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పేరిట అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించిందన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీలో భాగంగా పట్టణ రద్దీ, కాలుష్యాన్ని తగ్గించడం, ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలలో ఒకటిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 అనేది బాపు ఘాట్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ నిర్మాణం, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రై పోర్టులు, రెండో దశ మెట్రో రైలు, విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నామన్నారు.

మేడారంలో మీటింగ్

తెలంగాణ చరిత్రలో మొదటిసారిగా మేడారంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. గతంలో చేసిన తాత్కాలిక ఏర్పాట్లకు భిన్నంగా మేడారం జాతరకు ఈసారి పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. రూ.251 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రెండు కోట్ల భక్తులు జాతరలో పాల్గొంటారని అంచనా వేశారు.

రైతులకు రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గవర్నర్ వివరించారు. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసినట్లు వివరించారు. రైతు భరోసాను ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో, 14.24 లక్షల మంది రైతుల నుంచి దాదాపు 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.

ఢిల్లీలో ఘనంగా గణతంత్ర వేడుకలు

■ జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
■ ఆకట్టుకున్న ఆపరేషన్ సిందూర్ శకటం ■ శుభాంశు శుక్లాకు అశోక చక్ర ప్రదానం

అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సైనికులు కవాతు నిర్వహించారు. వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా వేడుకల్లో పాల్గొంది. ఈ సారి ముఖ్య అతిథులుగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా సైనికుల కవాతు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు స్వదేశీ ఆయుధ వ్యవస్థలను సైన్యం ప్రదర్శించింది. బ్రహ్మోస్, ఆకాశ్ మిసైల్స్, 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్, యుద్ధట్యాంకులను పరేడ్‌లో ప్రదర్శించారు. వేడుకల్లో ప్రధాని మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఐఎస్ఎస్‌ను సందర్శించిన శుభాంశు శుక్లాకు అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర'ను రాష్ట్రపతి ప్రదానం చేశారు.

బీసీ కులగణనపై మోసం చేస్తున్న కేంద్రం: కవిత

అక్షరటుడే, హైదరాబాద్: దేశంలో బీసీ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసానికి పాల్పడుతోందని తెలంగాణ జాగృతి చీఫ్ కవిత సంచలన ఆరోపణలు చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రం విడుదల చేసిన కులగణన డాక్యుమెంట్‌లో 'బీసీ' అనే స్పెషల్ కాలమ్ లేకపోవడం బీసీ సామాజిక వర్గాలను అవమానించడమేనని ఆమె మండిపడ్డారు.

భగ్గుమంటున్న బంగారం, వెండి ధరలు..

అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : బంగారం, వెండి ధరలు సామాన్యుడిని వణికిస్తున్నాయి. దేశవ్యాప్తంగా బంగారం ధరలు రోజురోజుకు కొత్త రికార్డులను సృష్టిస్తూ వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. ప్రస్తుతం దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,250గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,890 వద్ద కొనసాగుతోంది. వెండి విషయానికొస్తే దేశవ్యాప్తంగా కిలో వెండి ధర రూ.3,34,900గా ట్రేడవుతోంది.

భారీ కెమెరాతో రెడ్‌మీ ఫోన్

అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్స్ తయారీ సంస్థ అయిన రెడ్‌మీ మిడ్ రేంజ్‌లో కొత్త మోడల్‌ను భారత మార్కెట్‌లోకి తీసుకువస్తోంది. కొత్త మోడల్‌ను రెడ్‌మీ నోట్ 15 ప్రో 5జీ పేరుతో ఈనెల 29న విడుదల చేయనుంది. 6.83 ఇంచ్ 1.5కే ఓఎల్ఈడీ అమోలెడ్ డిస్ప్లేతో రానుంది. ఇది 120 హెడ్జ్ రిఫ్రెష్ రేట్, 1280 2772 పిక్సల్ రిజల్యూషన్ కలిగి ఉంది. ఐపీ68, ఐఈ69 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టన్స్ సర్టిఫికెట్ ఉంది. వెనకవైపు 200 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యూయల్ కెమెరా సెట్ అప్ ఉంది. 6580 ఎంఏహెచ్ సామర్థ్యంగల బ్యాటరీ.. 45 వాట్ ఫాస్ట్ చార్జింగ్‌ను సపోర్ట్ చేస్తుంది. వివిధ వేరియంట్లలో రానుంది. ధర రూ. 24,999 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

రూ.26 వేలకే కారు అంటూ ప్రచారం..

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: రాష్ట్రంలో ఇటీవల కొందరు తక్కువ ధరకు వస్తువులు అంటూ సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారు. తాము ఫేమస్ కావడానికి ఇలాంటి పోస్టులు పెడుతున్నారు. తీరా అక్కడకు వెళ్లాక ప్రజలను మోసం చేస్తున్నారు. తాజాగా కొందరు ఏకంగా రూ.26 వేలకే కారు ఇస్తామని ప్రచారం చేశారు. హైదరాబాద్ నగర శివార్లలోని మల్లాపూర్ ప్రాంతంలో సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మే ఓ గ్యారేజ్ ఉంది. వాళ్లు రూ.26 వేలకు కారు ఇస్తామని ప్రచారం చేశారు. దీంతో ప్రజలు భారీగా వచ్చారు. అయితే అక్కడ ఎవరు లేరు. కార్లు సైతం కనిపించలేదు. అనంతరం వ్యాపారి రోషన్ వచ్చి కార్లు లేవని చెప్పాడు. దీంతో ప్రజలు గ్యారేజీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపంతో గ్యారేజీలో ఉన్న కార్లను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసిన ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి పంపించారు.

నియోజకవర్గాల పునర్విభజనపై ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు

అక్షరటుడే, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనగణన తర్వాత ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా త్వరలో జనగణన చేపట్టనున్న విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనగణన ప్రక్రియకు ఎక్కువ సమయం పట్టదని చెప్పారు. ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోపు ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

విరిగిన జెండా కర్ర.. మంత్రికి తప్పిన ప్రమాదం

అక్షరటుడే, మహబూబ్‌నగర్: గణతంత్ర వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరికి తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన జెండా ఎగుర వేస్తుండగా కర్ర విరిగి కింద పడింది. మక్తల్ తహశీల్దార్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలకు మంత్రి హాజరయ్యారు. జెండాను కార్యాలయంపైన ఏర్పాటు చేశారు. మంత్రి కింద నుంచి జెండా ఆవిష్కరించేందుకు సిద్ధం అయ్యారు. దీనికోసం జెండాకు కట్టిన తాడు లాగగా.. ఒక్కసారిగా జెండా కర్ర విరిగిపోయి కార్యాలయంపై నుంచి కింద పడింది. అయితే మంత్రి పక్కకు తప్పుకోవడంతో ఆయనకు ప్రమాదం తప్పింది. వాకిటి శ్రీహరి సమీపంలోనే కర్ర పడింది. ఈ ఘటనలో మరో వ్యక్తి గాయపడ్డాడు.

సౌమ్య కుటుంబానికి అండగా ఉంటాం : రాజనర్సింహ

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఉదయం పరామర్శించారు. సౌమ్య హెల్త్ కండీషన్‌ను నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర వైద్యులు మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. సౌమ్యకు ఇలా జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, సౌమ్య పూర్తిగా కోలుకుంటుందన్నారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. సౌమ్య పూర్తిగా కోలుకునే వరకూ మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత తమదేనని తెలిపారు.